క్లుప్తంగా

అందుబాటులో జీలుగ విత్తనాలు

కురవి: రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి గుంటక నరసింహరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు గుండ్రాతిమడుగు(విలేజి) సొసైటీలో ఉన్న జీలుగ విత్తనాలను పరిశీలించారు. కురవి సొసైటీలో 833 బస్తాలు, గుండ్రాతిమడుగులో 334 బస్తాల జీలుగ విత్తనాలు ఉన్నాయని వివరించారు. ఈనెల 26వ తేదీ నుంచి విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు.

దంతాలపల్లి: మండలంలోని రైతుల కోసం జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏఓ వాహిని వాహిని శుక్రవారం తెలిపారు. విత్తనాలు 50శాతం సబ్సిడీతో అందస్తామన్నారు.

చెరువు కట్టలకు మరమ్మతులేవి?

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల్లో గత సంవత్సరంలో గాలివాన బీభత్సానికి తెగిపోయిన చెరువు కట్టలకు మరమ్మతులేవని మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండలంలోని రాజులకొత్తపల్లి, రావిరాలలో తెగిపోయిన పెద్ద చెరువులను మెపా ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుండి అశోక్, ప్రధాన కార్యదర్శి యాకయ్య, తోట రమేశ్, రాజు, చిరంజీవి, కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

బొడ్రాయి వేడుకలు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు శనిగపురం గ్రామ శివారు భగ్గుతండాలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు హాజరై గ్రామ దేవత సన్నిధిలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో 9వ వార్డు మాజీ కౌన్సిలర్ బానోత్ హరిసింగ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మాజీ వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణు, మంగళపల్లి కన్న, జేరిపోతుల వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని వేమునూరు గ్రామంలో కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు లూనావత్ అశోక్, వెంకన్న, షరీఫ్, గుగులోతు రాంచందర్, నలమాస శ్రీనివాస్, సాయి, రవి, వెంకన్న, వంశీ పాల్గొన్నారు.

మంత్రికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు




మరిపెడ రూరల్: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదిన సందర్భంగా హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్: అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని సీరోలు తహసీల్దార్ వున్నంచందర్ కోరారు. సీరోలు మండలంలోని మోదుగగడ్డ తండా, దుబ్బగడ్డతండా పరిధిలోని ఆకేరు వాగు పరివాహక ప్రాంతంలో శుక్రవారం తహసీల్దార్ పర్యటించి స్థానికులతో మాట్లాడారు.

సాగుకు సమాయత్తం..



భూమి దున్నుతున్న రైతు

నర్సింహులపేట: వర్షం పడటంతో ఖరీఫ్ సీజన్ కోసం రైతు సాగుకు సమాయత్తమయ్యాడు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు రైతన్న నాగలి, ట్రాక్టర్‌తో వ్యవసాయ భూమిని సాగు చేస్తున్నారు. పెసర, పత్తి పంటల సాగుకు పంట భూమిని సిద్ధం చేస్తున్నారు.

లక్ష్యం చేరేనా?

- 2.25లక్షల క్వింటాళ్లకు, 1.70లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ
- రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల పడిగాపులు



పోచంపల్లి గ్రామంలో మిల్లుకు తరలిస్తే వెనక్కి పంపిన ట్రాక్టర్

పెద్దవంగర: గతంలో దిగుబడులు రాక రైతులు కలత చెందారు. ఈ యాసంగిలో మంచి దిగుబడులు సాధించారు. ఐనప్పటికీ అన్నదాతలు అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పండించిన వరి ధాన్యంను అమ్ముకోవానికి వస్తే అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. అకాల వర్షాలు నిర్వహణ లోపాలు, సౌకర్యాలు రైతులను కలవరపెడుతున్నాయి.

మండలంలో సుమారు ఈ యాసంగిలో 13,220 ఎకరాల్లో వరిసాగు చేశారు. కొనుగోలు కేంద్రాలకు 2లక్షల 25క్వింటాళ్ల వరిధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. కాగా ఇప్పటి వరకు సూమారు. లక్షా 70క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. మరో పక్షం రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుండగా ధాన్యం అమ్మితేనే రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతారు. కానీ కొనుగోళ్లలో జాప్యంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల్లోనే నిరీక్షిస్తున్నారు.

18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

మండలంలోని బొమ్మకల్లు, కొరిపల్లి, పోచంపల్లి, ఉప్పరగూడెం, బంగారు చెలిమి తండా, వడ్డెకొత్తపల్లి, పెద్దవంగరలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో అవుతాపురం, బావోజీ తండా, చిట్యాల గంట్లకుంట, పోచంపల్లి, వడ్డెకొత్తపల్లి, చిన్నవంగర, రామచంద్రు తండా, లొట్లబండ తండా, కాన్వాయిగూడెం, పెద్దవంగర మండల కేంద్రంలో సైతం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అకాల వర్షాల ప్రభావం..

ఇటీవల కురుస్తున్న ఆకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతుండగా కాంటా వేసిన బస్తాలు టార్పాలిన్‌లు కప్పినప్పటికీ తడిపోతున్నాయి. ఉదయం ఎండలు సాయంత్రం వానలతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాలకు తెచ్చి ఇరవై రోజులు గడుస్తున్న కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి తడిసి నాణ్యత కోల్పోతుంది. వ్యవసాయం చేసి పంట పండించిన దానికంటే ధాన్యం అమ్ముకోవడానికి అరిగోస పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంటాలు పెట్టి రోజులు గడుస్తున్న లారీలు రాక కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ధాన్యం కేంద్రాల నుంచి త్వరగా తరలించాలని రైతులు వేడుకుంటున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



మండల కేంద్రంలోని ధాన్యం ఐకేపీ కొనుగోలు కేంద్రానికి 180బస్తాల వరి ధాన్యాన్ని తీసుకొచ్చాను. కాంట వేయగా 72క్వింటాళ్లు అయ్యాయి. తూకం వేసి 15రోజులు గడుస్తున్న నేటికి తరలించలేదు. మిల్లులకు ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్తే లిమిట్ పూర్తి అయ్యింది తీసుకోమని వెనక్కి పంపిస్తున్నారు. మిల్లులకు పంపించాలని చెబుతున్న లారీలు రావడం లేదని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. కురుస్తున్న వానలకు ఇబ్బందులు పడుతున్నాం.

\- దేవా, రైతు, టీక్యా తండా, పెద్దవంగర

గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్టు



అరెస్టు చూపుతున్న సీఐ సర్వయ్య

కురవి: అక్రమంగా తరలిస్తున్న 1.5 కేజీల గంజాయిని పట్టుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య శుక్రవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కురవి పీఎస్సై జీవీ కృష్ణారెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట ఖమ్మం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పల్సర్ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వస్తూ అనుమానాస్పదంగా కనిపించినట్లు తెలిపారు. వాహనాన్ని ఆపి, వారి వద్ద ఉన్న బ్యాగ్ చెక్ చేయగా రూ.75వేల విలువైన కేజీన్నర గంజాయి లభ్యమైందన్నారు. కురవి మండలం మొగిలిచర్ల గ్రామానికి చెందిన జి.చందు, ఎస్.నాగరాజు, జి.ఉపేందర్‌లను పట్టుకుని వారి వద్ద నుంచి ఒక బైక్, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

మరిపెడలో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

మరిపెడ రూరల్: మరిపెడ మండల కేంద్రంలో కార్గిల్ సోల్జర్ మెమోరియల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గాదె రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం తిరంగ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌పై భారత్ జరిపిన సైనిక దాడుల్లో అమరులైన భారత్ జవానుల త్యాగాలను స్మరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు తిరంగా ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. అమరుడైన జవాన్ మురళీ నాయక్‌కు నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ సెంటర్ నుంచి కార్గిల్ సెంటర్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్బోజు గంగాధరాచారి, జిల్లా కౌన్సిల్ సభ్యులు భూక్య సుధాకర్ నాయక్, బీజేపీ నాయకులు పాల్వాయి భాస్కర్, జగన్‌నాయక్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి



గూడూరు: మాట్లాడుతున్న ట్రెయినీ ఎస్సై

గూడూరు: విద్యార్థులకు సైబర్ నేరాలు, మోసాలు, మహిళలు, బాలికల పట్ల ప్రవర్తన, పలు అంశాలపై అవగాహన కల్పించాలని ట్రెయినీ ఎస్సై కోటేశ్వర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతిలో సైబర్ నేరాలు, మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవికుమార్, ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్లు అమృ నాయక్, రవి, పాల్గొన్నారు.

కొత్తగూడ: విద్యార్థులకు పాఠశాలల్లో సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ఏఎస్సై సదానందం అన్నారు. కస్తూర్బా గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ గుమ్మడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిఘా పెట్టాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలబాలికలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి, నిఘా ఉంచాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిలా హోలీ ఏంజిల్స్ హైస్కూల్లో ఉపాధ్యాయుల శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై సునంద హాజరై మాట్లాడుతూ.. నేటి కాలంలో నేరాల అదుపులో ఉండే విధంగా విద్యార్థులు కీలక పాత్ర పోషించేలా వారిని తీర్చిదిద్దాలన్నారు.

దంతాలపల్లి: ప్రజలకు మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్సై పిల్లల రాజు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణలో ఎస్సై పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి

చిన్నగూడూరు: ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి శాంతి చర్చలు జరపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శుక్రవారం మండలంలోని గుండంరాజుపల్లిలో గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సుధాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం గుండంరాజుపల్లి శాఖ కార్యదర్శిగా ఒగ్గుల వెంకన్నను ఐదుగురితో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గంజి శేషాద్రి రెడ్డి, దొంతు స్టాలిన్, పోలెపాక వెంకన్న, కందుల వెంకన్న పాల్గొన్నారు.

ఎరువుల షాపు తనిఖీ

నెల్లికుదురు: నకిలీ విత్తనాలను ప్రోత్సహించి, రైతులను మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ యాస్మిన్, ఎస్సై చిర్ర రమేష్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన షాపులను శుక్రవారం పోలీస్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎస్సై చిర్ర రమేశ్‌బాబుతో కలిసి ఏఓ యాస్మిన్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రొబెషనరీ ఎస్సై శివ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆ చేతి పంపు నీటికి క్యూలైన్..!



తాగునీటి కోసం చేతిపంపు వద్ద వరుస క్రమంలో పెట్టిన క్యాన్లు

బయ్యారం: చిత్రంలో వరుస క్రమంలో నీటి క్యాన్లు పెట్టింది నివాసాల మధ్యన కాదు.. జనావాసాలకు దూరంగా ఉన్న చేతిపంపు వద్ద.. ఈ చేతిపంపు నీరు తాగేందుకు రుచికరంగా ఉండడంతో పలువురు ఈ నీటిని తాగేందుకు ఉత్సాహం చూపుతున్నారు. చేతిపంపు నుంచి నీటిని తెచ్చుకునే వారు ఇలా క్యూ కట్టాల్సి వస్తుంది. బయ్యారానికి మూడు కిలోమీటర్లదూరంలో జాఫ్రబాద్ క్రాస్ వద్ద ఉన్న ఈ చేతిపంపు కొన్ని సంవత్సరాలుగా తాగునీరును అందిస్తుంది. చుట్టు పక్కల గ్రామాల వారు క్యాన్ల ద్వారా నీటిని తీసుకెళ్లి తాగు నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అశోక్

చిన్నగూడూరు: 18 సంవత్సరాలు నిండకుండా అమ్మాయిలకు చేయడం చట్టరీత్యా నేరమని, ఎంతటి వారినైనా శిక్షించే హక్కు చట్టాలకు ఉందని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దాశరథి ప్రాంగణంలో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించి, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేసుకున్న వారిలో గృహహింస బారినపడే వారే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. అనంతరం బాల్యవివాహాలు చేయనివ్వమని స్థానికులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీకాంత్, గ్రామస్తులు రామడుగు బ్రహ్మం, కుసుమ వెంకన్న, పోల్కం నాగన్న, జంపాల శ్రీను, కృష్ణవేణి, వెంకటమ్మ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యం



మొలకెత్తిన ధాన్యం బస్తాను చూపిస్తున్న రైతు

కురవి: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటా అయిన బస్తాల్లోని ధాన్యం వర్షానికి తడిసి మొలకెత్తాయి. శుక్రవారం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో బాదావత్ యుగేందర్ అనే రైతుకు చెందిన ధాన్యం కాంటా పెట్టారు. కాంటా అయిన బస్తాలను టార్పలిన్‌లు పెట్టి నిల్వ ఉంచారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాంటా అయిన ధాన్యం బస్తాల నుంచి మొలకెత్తడంతో రైతు లబోదిబోమంటున్నాడు. సకాలంలో లారీలు రాకపోవడంతో కాంటా అయిన బస్తాలు మిల్లులు చేరక వర్షానికి తడిసిపోయాయి. తడిసి మొలకెత్తుతున్న బస్తాల్లోని ధాన్యం తీసి మళ్లీ తిరిగి ఆరబెట్టి బస్తాల్లో నింపాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటి వరకు కేంద్రంలో 1282 బస్తాల ధాన్యం కాంటా పెట్టి ఉంచినట్లు నిర్వాహకుడు జితేందర్ తెలిపారు. మరో 8వేల బస్తాలకు సరిపడ ధాన్యం రాసులున్నాయని వివరించారు. త్వరితగతిన కాంటా వేసి మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు. వర్షాలు వస్తే ధాన్యం తడిసే ప్రమాదం ఉందని రైతులు గొల్లుమంటున్నారు.

పేదలకు అందని ప్రభుత్వ వైద్యం

- గత ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన
- ఇంతవరకు ప్రారంభం కాని పనులు



పీహెచ్‌సీ నిర్మాణానికి వేసిన శిలాఫలకం

నర్సింహులపేట: మండల కేంద్రంలో పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)నిర్మాణానికి శిలాఫలకం ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు అయ్యింది. ఇంత వరకు ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టలేదు. మండలంలో ఎక్కువగా గిరిజనులు, పేదప్రజలు ఎక్కువగా ఉంటారు. నిరుపేదలకు వైద్యం అందించడానికి గత ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరై, పనుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన పనులు మాత్రం మొదలు కాలేదు. ప్రభుత్వం మారడంతో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి మండలంలో దంతాలపల్లిలో ఆరోగ్య కేంద్రం ఉంది. ప్రభుత్వం వైద్య కావాలంటే 28 కిమీ దూరంలోని మహబూబాబాద్, 23కిమీ దూరంలోని తొర్రూరుకు వెళ్లాల్సిందే. దూర ప్రాంతాలకు వేళ్లలేని పేదలు స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీనిపై పంచాయతీ రాజ్ డీఈ నర్సింగ్‌నాయక్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారులు స్థల పరిశీలన చేశారని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు.

పచ్చిరొట్ట సాగుతో మేలు



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం: పచ్చిరొట్ట సాగుతో రైతులకు మేలు కలుగుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బయ్యారంలోని సొసైటీలో 50శాతం సబ్సిడీతో ప్రభుత్వం సరఫరా చేసిన జీలుగ, జనుము విత్తనాలను శుక్రవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీలుగ, జనుమును సాగు చేసుకోవడం ద్వారా భూమిలో సారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, ఏడీఏ శ్రీనివాస్, తహసీల్దార్ నాగరాజు, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఓ రాంజీతోపాటు రైతులు, ఏఈఓలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు



తొర్రూరు: మున్సిపాలిటీ అభివృద్ధికి మరింత చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో కొత్తగా వచ్చిన రెండు జేసీబీ వాహనాలు, ఒక్కటి స్వచ్ఛ ఆటోస్ వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఏఈ రంజిత్, మేనేజర్ కట్టస్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు, సినియర్ అసిస్టెంట్స్ రాజయ్య పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలను తరలించాలి

కొత్తగూడ: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలను వెంట వెంటనే మిల్లులకు తరలించాలని తహసీల్దార్ రాజు సూచించారు. శుక్రవారం మండలంలోని గాంధీనగర్, మైలారం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓ రాజు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు నేడు చివరి తేదీ

కురవి: జిల్లాలోని కురవి, గూడూరు, కొత్తగూడ, బయ్యారం, సీరోలు ఏకలవ్య మోడల్ స్కూల్/కాలేజీలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు నేడు చివరి తేదీ అని ఆర్‌సీఓ రత్నకుమారి, ప్రిన్సిపాల్ లాలు శుక్రవారం తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడిగా వెంకన్న

గార్ల: గార్ల మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడిగా జంపాల వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా ధరావత్ వీరన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం గార్లలో మండల మహాసభలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న పాల్గొని మాట్లాడారు. జూన్ 8వ తేదీన సంఘం జిల్లా 3వ మహాసభలు తొర్రూరులో నిర్వహించనున్నట్లు, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జీఓ నంబర్ 2ను రద్దు చేయాలి

కొత్తగూడ: జీఓ నంబర్ 2ను రద్దు చేసి జీఓ నంబర్ 5ను అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు రామయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పోలారం కస్తూర్బా గురుకుల పాఠశాల ఆవరణలో కరపత్రాలు ఆవిష్కరించారు.

పెద్దమ్మ తల్లి పండుగ

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామంలో ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి తిరుగూ పండుగ వేడుకలను అత్యంత వైభవంగా శుక్రవారం జరుపుకున్నారు. అనంతరం దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన దాతలు ఉమ్మగాని పద్మ, ఏల్లాగౌడ్ (ఏఎస్సై) దంపతులు, చెట్టబోయిన మాధవి, స్వామి (ప్రభుత్వ ఉపాధ్యాయుడు) దంపతులు, సాధుల మౌనిక, యాకాంబ్రం దంపతులను ముదిరాజ్‌లు సన్మానించారు.

బూటకపు ఎన్‌కౌంటర్‌ను ఖండించాలి

తొర్రూరు: మావోయిస్టు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంబాల కేశవ్‌రావుతోపాటు మరో 27మందిని బూటకపు ఎన్‌కౌంటర్ చేసి చంపివేయాన్ని అన్నివర్గాల ప్రజలు ఖండించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయన్న అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు భిక్షపతి, యాకుబ్, లింగాచారి పాల్గొన్నారు.

మహనీయుడు భాగ్యరెడ్డివర్మ

నెహ్రూసెంటర్: భారత జాతి గర్వించదగిన భాగ్యనగరపు మహనీయుడు భాగ్యరెడ్డివర్మ అని విద్యుత్‌శాఖ డీఈ పి.విజయ్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్, డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. భాగ్యరెడ్డివర్మ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వీరాజిత, డాక్టర్ అనిత, బేతమల్ల వినోద్, బోడ లక్ష్మణ్, కందుల అంబేడ్కర్ పాల్గొన్నారు.

కేసు నమోదు

డోర్నకల్: చెరువులో చేపల దొంగతనానికి ప్రయత్నించిన 27మందిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పెరుమాళ్ల సంకీస పెద్ద చెరువులో ఈనెల 21న కొంతమంది చేపల చోరీకి ప్రయత్నించారని చెరువు సొసైటీ చైర్మన్ కాపరబోయిన నర్సయ్య ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తెల్లబండతండాకు చెందిన 27 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీమా చెక్కు అందజేత

డోర్నకల్: కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు డోర్నకల్ ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.1000 చెల్లించి జనరల్ ఇన్సూరెన్స్ చేయించుకున్నాడు. ఇటీవల వెంకటేశ్వర్లు ప్రమాదవశాత్తు మరణించాడు. మంజూరైన రూ.20లక్షల బీమా చెక్కును మృతుడి భార్య మాధవికి డీజీఎం ఘనశ్యాం సొలంకి శుక్రవారం అందజేశాడు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎస్‌ఎంవీ సుబ్బారావు, బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ సుధాకర్, జనరల్ ఇన్సూరెన్స్ ఇన్‌చార్జ్ రమేశ్ పాల్గొన్నారు.

మున్సిఫ్ కోర్టు ఏర్పాటు చేయాలి

మరిపెడ రూరల్: మండల కేంద్రంలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శుక్రవారం పట్టణంలో సీపీఐ 5వ మహాసభ నిర్వహించగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఉద్యమం చేయాలని తీర్మానం చేశారు. ఈనెల 25న సీపీఐ మండల ఏడవ మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక



తొర్రూరు రూరల్: బీజేపీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ ఎన్నికల కమిటీ ఇన్‌చార్జ్ పూసాల శ్రీమాన్ శుక్రవారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా గట్టు రాంబాబు, ఉపాధ్యక్షులుగా దాసరి ఉమేష్, సిరిపాటి విశాల్, దాసరోజు సంతోష్, వెల్పుకొండ రవితేజ, ప్రధాన కార్యదర్శులుగా యాకన్న, భాస్కర్‌నాయక్, కార్యదర్శులుగా నవీన్, మహేష్, రంగు కుమార్, నరేందర్, కోశాధికారిగా సుమంత్ ఎన్నికయ్యారు.

రాయితీపై విత్తనాలు అందించాలి

గార్ల: ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన రైతులకు 50శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శుక్రవారం గార్లలో ఆయన మాట్లాడారు. తునికాకు కార్మికులకు పెండింగ్ డబ్బులు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వీరభద్రం, మనోహర్, సక్రు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సంఘం నూతన కమిటీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టం శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సమ్మయ్యరాథోడ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా భూక్య హరికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కునుసోత్ దేవేందర్, కోశాధికారిగా గుగులోత్ చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు బానోత్ మంగిలాల్, మల్లెల రాము, కార్యదర్శులుగా పోరిక అనిల్, ధరంసోత్ తిరుపతి, కునుసోత్ కిషన్, సమాచార ప్రచార కార్యదర్శులు బానోత్ రవీందర్, రంజిత్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా వట్టం రామచందర్, మూడు స్వామి, గుగులోతు నాను, వీరన్న, ఆదినారాయణ, ఇస్లావత్ రాములను ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తొర్రూరు రూరల్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన వెలిశాల సంపత్(36) తొర్రూరు పట్టణానికి చెందిన స్వప్న అనే యువతిని 12ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలుగా ఉండగా, కొన్ని నెలలుగా ఆర్థిక ఇబ్బందులతో భార్య, భర్తలు ఇద్దరు తరుచూ గొడవపడుతున్నారు. ఈక్రమంలోనే ఈనెల 22న తొర్రూరులోని అత్తగారి ఇంటి వద్ద మరోసారి భార్య, భర్తలు ఇద్దరు గొడవపడగా, మనస్తాపం చెందిన సంపత్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా సంపత్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.